క్లుప్తంగా

పైడితల్లి దర్శనానికి బారులు తీరిన భక్తులు


అమ్మ దర్శనానికి బారులు తీరిన భక్తులు

విజయనగరం టౌన్: పైడితల్లి దర్శనానికి భక్తులు ఆదివారం బారులు తీరారు. ఆలయ ప్రధానార్చకుడు ఏడిద రమణ ఆధ్వర్యంలో అమ్మవారికి వేకువజామునుంచి పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అమ్మవారి దర్శనం కలిపించారు. మహిళలు అమ్మవారిని దర్శించి, పసుపు, కుంకుమలను సమర్పించి మొక్కుబడులు చెల్లించుకున్నారు.

అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు


చదురుగుడి వద్ద చిన్నారుల నృత్యప్రదర్శన

విజయనగరం టౌన్: పైడితల్లి అమ్మవారి దేవస్థానం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆద్యంతం ఆహూతులను ఆకట్టుకుంటున్నాయి. వనంగుడి ఆవరణలో జరిగిన ప్రదర్శనలో షేక్ ఇబ్రహీం బృందం భక్తిగీతాలు, శ్యామలాంబ, డమరుసింగ్ కోలాటం, దేవులపల్లి కృష్ణ గణేష్‌శర్మ ఏకపాత్రాభినయం చూపరులను అలరించాయి. అదేవిధంగా చదురుగుడి వద్ద నిర్వహించిన చిన్నారుల నృత్యప్రదర్శన ఆకట్టుకుంది.

అభినందనలు


తన్నికకు జ్ఞాపిక అందజేస్తున్న ప్రసాదరావు

విజయనగరం ఫోర్ట్: పశ్చిమగోదావరి జిల్లా వీరవాసరం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఆంధ్రప్రదేశ్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నిర్వహించిన 67వ ఇంటర్ డిస్ట్రిక్ టోర్నమెంట్‌లో స్థానిక సెయింట్ మేరీ పాఠశాలలో ఏడో తరగతి విద్యార్థి మజ్జి తన్నిక రిథమిక్ యోగలో మూడో స్థానం సాధించింది. దీంతో తన్నికను ఆదివారం స్థానిక రెడ్‌క్రాస్ సొసైటీలో చైర్మన్ ప్రసాదరావు అభినందించారు. కార్యక్రమంలో యోగా గురువు రాజేశ్వరావు, సుందరరావు, తదితరులు పాల్గొన్నారు.

వల్లూరులో పండగ సంబరాలు


గ్రామ పుర వీధుల్లో అమ్మవారిని ఊరేగిస్తున్న భక్తులు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని వల్లూరులో గ్రామ దేవత పండగలు ఆదివారం రాత్రి నుంచి వైభవంగా ప్రారంభమయ్యాయి. గంగాదేవి, బంగారమ్మ ఉత్సవాలను సుమారు 20 సంవత్సరాల తర్వాత నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో తొలిరోజు అమ్మవారి ఘటాలను మేళ, తాళాలతో గ్రామ పుర వీధుల్లో ఊరేగించారు. గ్రామస్తులు అమ్మవారికి పసుపు, కుంకుమలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ నిర్వాహకులు మాట్లాడుతూ.. ఈ నెల 7న సాంస్కృతిక కార్యక్రమాలు నడుమ అమ్మవారి అనుపోత్సవం నిర్వహిస్తామన్నారు. ఉత్సవాలను గ్రామపెద్దలు పంచాది శ్రీరాములనాయుడు, కంది శ్రీనివాసరావు, తదితరులు పర్యవేక్షిస్తున్నారు.

విద్యుత్‌శాఖ ఎస్‌ఈకి అభినందనలు


విద్యుత్‌శాఖ ఎస్‌ఈకి అభినందనలు తెలియజేస్తున్న విద్యుత్ ఉద్యోగుల సంఘ ప్రతినిధులు

విజయనగరం ఫోర్ట్: విజయనగరం ఉత్సవాలు, అమ్మవారి జాతరకు ఎటువంటి అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేసినందుకు గాను విద్యుత్‌శాఖ ఎస్‌ఈ మువ్వల లక్ష్మణరావుకు ఏపీ విద్యుత్ ఉద్యోగుల సంఘం (1104) సభ్యులు ఆదివారం అభినందనలు తెలిపారు. భవిష్యత్‌లో జరిగే కార్యక్రమాలను కూడా విజయవంతంగా నిర్వహించాలని ఆకాక్షించారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు వంపండు లక్ష్మణ్, జిల్లా కార్యదర్శి సురగాల లక్ష్మణ్, ఆర్‌వీ రమణ, శ్రీనివాస్, దేముడు, మంగరాజు, లండ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

విచ్చలవిడి వినియోగం తగదు..

- నగర పంచాయతీలో అధిక మోతాదులో ప్లాస్టిక్ ఉత్పత్తుల వాడకం
- హోటళ్లు, దుకాణాల్లో కొనసాగుతున్న పాలిథిన్ కవర్ల వినియోగం
- మూడేళ్లలో ప్లాస్టిక్ అమ్మకందారుల నుంచి రూ.10,374 అపరాధ రుసుం విధింపు
- అయినా ఎక్కడికక్కడ పాలిథిన్ వ్యర్థాలు..


నెల్లిమర్ల పూడమ్మతల్లి గుడివద్ద వ్యర్థాలు

నెల్లిమర్ల: నగర పంచాయతీలో ప్లాస్టిక్ నిషేధం పూర్తి స్థాయిలో అమలు కావడం లేదు. హోటళ్లు, కిరాణా, స్వీట్‌షాపులు, బేకరీల్లో ఇప్పటికే పాలిథిన్ సంచులు, కవర్లను విచ్చలవిడిగా వినియోగిస్తున్నారు. నగర పంచాయతీ, సచివాలయ అధికారులు, సిబ్బంది నిషేధంపై పూర్తి స్థాయిలో శ్రద్ధ చూపకపోవడంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల లక్ష్యం నెరవేరడం లేదు. నెల్లిమర్ల నగర పంచాయతీ పరిధిలో 20 వార్డులుండగా.. నెల్లిమర్ల, జరజాపుపేట ప్రాంతాల్లోని ప్రధాన రహదారిలోనే హోటళ్లు, కూరగాయల దుకాణాలు, బేకరీ, స్వీట్‌షాపులు ఎక్కువగానే ఉన్నాయి. పర్యావరణ పరిరక్షణ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్దేశిత మందం కంటే తక్కువ ఉన్న ప్లాస్టిక్, పాలిథిన్ కవర్లు, సంచులు, గ్లాసులు, కప్పులతో పాటు బ్యానర్లు, బెలూన్లను నిషేధించారు. ఎవరైనా వినియోగించినా, విక్రయించినా చట్టప్రకారం చర్యలు చేపడతామని మున్సిపల్ అధికారులు హెచ్చరికలు జారీ చేశారు.

ఎక్కడికక్కడే..

హోటళ్లలో పాలిథిన్ కవర్లు, కప్పులు విచ్చలవిడిగా వినియోగిస్తున్నారు. ఆహారపదార్థాలు వడ్డించే ప్లేట్లలో పాలిథిన్ కవర్లు వేస్తున్నారు. అలాగే పార్శిళ్ల కోసం పాలిథిన్ సంచులను వినియోగిస్తున్నారు. స్వీట్‌షాపులు, బేకరీల్లో అయితే నిషేధం మాట అస్సలు పట్టించుకోవడం లేదు. కూరగాయలు, కిరాణా దుకాణాలు, చికెన్‌సెంటర్ల యజమానులు పాలిథిన్ కవర్లలోనే సరుకులు విక్రయిస్తున్నారు. నగర పంచాయతీ, సచివాలయ సిబ్బంది చిత్తశుద్ధితో పనిచేయకపోవడం వల్లే పట్టణంలో ప్లాస్టిక్, పాలిథిన్ నిషేధం పూర్తిస్థాయిలో అమలు కావడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్లాస్టిక్ రహిత పట్టణంగా తీర్చిదిద్దాలన్న ప్రభుత్వ లక్ష్యానికి తూట్లు పొడుస్తున్నట్లవుతోంది.

మూడేళ్లకాలంలో ప్లాస్టిక్ అమ్మకందారులపై విధించిన అపరాధరుసుం వివరాలు	
సంవత్సరం	అపరాధ రుసుము
2020	రూ.300.00
2021	రూ.750.00
2022	రూ.9325.00
మొత్తం	రూ.10374.00

చర్యలు చేపడుతున్నాం



పట్టణంలో ప్లాస్టిక్ నిషేధానికి పూర్తిస్థాయిలో చర్యలు చేపడుతున్నాం. ఇప్పటికే వ్యాపారులకు అవగాహన కల్పించాం. ర్యాలీలు చేపట్టాం. వార్డు వలంటీర్లు, సచివాలయ సిబ్బంది సహకారంతో పూర్తిస్థాయిలో అమలు చేస్తాం. మూడేళ్ల కాలంలో ప్లాస్టిక్ అమ్మకందారులపై రూ.10374 అపరాధ రుసుం విధించాం.

– పి. బాలాజీప్రసాద్, నగర పంచాయతీ కమిషనర్, నెల్లిమర్ల

అందరి ఆరోగ్యమే జగనన్న లక్ష్యం

- ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు

నెల్లిమర్ల రూరల్: రాష్ట్రంలో అందరూ ఆరోగ్యంగా ఉండాలనే ఏకైక లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని రూపొందించారని ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు అన్నారు. సురక్ష కార్యక్రమం విజయవంతంగా పూర్తయిన నేపథ్యంలో మండలంలోని మొయిద విజయరామపురం ఆయన స్వగృహంలో ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ, పేదరికం కారణంగా కార్పొరేట్ వైద్యానికి ఏ ఒక్కరూ దూరం కాకూడదనే సంకల్పంతో సీఎం జగనన్న ఈ బృహత్తరమైన కార్యక్రమాన్ని రూపొందించారన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రవేశపెట్టి పేదలపాలిట దేవుడైతే, ఆయన తనయుడు జగన్ మోహన్‌రెడ్డి మరో అడుగు ముందుకు వేసి ఆరోగ్యశ్రీలో 3 వేల పైచిలుకు రోగాలకు కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఉచితంగా వైద్య చికిత్సలు అందిస్తున్నారని చెప్పారు. సుమారు నెల రోజుల పాటు అన్ని సచివాలయ పరిధిలో చేపట్టిన సురక్ష శిబిరాలు మంచి ఫలితాలను ఇచ్చాయన్నారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో 41,161 మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారని తెలిపారు. మరో 5,734 మంది నేత్ర పరీక్షలు చేయించుకున్నారన్నారు. టీడీపీ హయాంలో చంద్రబాబు కనీసం 108 వాహనాలకు డీజిల్ కూడా కొట్టించలేకపోయారని ఎద్దేవా చేశారు. దోచుకోవడమే తప్ప పేదల సంక్షేమం, అభివృద్ధిని చూసిన దాఖలాలే లేవన్నారు. చంద్రబాబుతో పాటు ఆయన దత్తపుత్రుడు పవన్‌కల్యాణ్ ప్రభుత్వంపై ఎంత బురదజల్లినా ఆకాశం మీద ఉమ్మినట్లేనన్నారు. పేదల కళ్లల్లో సంతోషం, పెదాలపై చిరునవ్వు ఉండాలని చూసే మంచి మనసున్న వ్యక్తి సీఎం జగనన్న అని కొనియాడారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మళ్లీ విజయఢంకా మోగిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

పేదల ఆకలి తీర్చడమే ఫుడ్ బ్యాంక్‌ల లక్ష్యం


అనాథలకు భోజనం వడ్డిస్తున్న డిప్యూటి స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

- డిప్యూటి స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: వివిధ అవసరాల నిమిత్తం జిల్లా కేంద్రానికి వచ్చే పేదలు ఆకలితో తిరిగి వెళ్లకూడదనే ఉద్దేశంతో నగరంలో ఆరు ఫుడ్‌బ్యాంక్‌ల ద్వారా ఉచితంగా ఆహారం అందిస్తున్నామని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. శ్రీ గౌరీ సేవా సంఘం ఆధ్వర్యంలో ఎన్‌సీఎస్ రోడ్డులో నిర్వహిస్తున్న ఫుడ్ బ్యాంక్‌కు రెండేళ్లు పూర్తి కావడంతో ఆదివారం చేపట్టిన భోజన వితరణ కార్యక్రమంలో ఆయన పాల్గొని పేదలకు స్వయంగా వడ్డించారు. అనంతరం కోలగట్ల మాట్లాడుతూ.. నగరంలోని ఆరు ఫుడ్ బ్యాంకుల ద్వారా నిత్యం వందలాది మందికి ఉచితంగా భోజనం పెడుతున్నామని తెలిపారు. తన ఆశయానికి గౌరీ సేవా సంఘం, గవర సామాజికవర్గ పెద్దలు అందిస్తున్న సహకారం మరువలేనిదన్నారు. ఈ రోజున వివాహ విందులా సుమారు 16 రకాలతో భోజనం పెట్టడం ఆనందంగా ఉందని, గౌరీ సేవా సంఘ సభ్యులు భవిష్యత్‌లో ఇటువంటి సమాజ హిత కార్యక్రమాలు మరిన్ని చేపట్టాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో గౌరీ సేవా సంఘ ప్రతినిధులు కనిశెట్టి సుధాకర్, అడారి నగేష్, ఓం శంకర్, కాండ్రేగుల శేఖర్, మొల్లేటి నాయుడు, అడారి బుజ్జి, తదితరులు పాల్గొన్నారు.

హిజ్రాల సేవానిరతి ప్రశంసనీయం


ఆహారం వడ్డిస్తున్న డిప్యూటీ మేయర్ శ్రావణి, తదితరులు

- డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి

విజయనగరం: ఆధ్యాత్మిక, సామాజిక సేవలో భాగమవుతున్న హిజ్రాల సేవానిరతి ప్రశంసనీయమని నగర డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి అన్నారు. నగరంలోని ఎన్‌సీఎస్ రోడ్డులో పెద్ద చెరువు ఒడ్డున వేంచేసిన విజయసాగర దుర్గా మల్లేశ్వర స్వామి ఆలయాన్ని ఆమె ఆదివారం దర్శించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో హెల్పింగ్ హ్యాండ్స్ హిజ్రాస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చేపడుతున్న అన్న వితరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, హిజ్రాల అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ రోజున సుమారు 5 వేల మందికి అన్న వితరణ చేయడం గొప్ప విషయమన్నారు. సేవా దృక్పథం ఉన్నవారిని ప్రోత్సహించేందుకు స్థానిక శాసనసభ్యుడు కోలగట్ల వీరభద్రస్వామి ఎప్పుడూ ముందుంటారని చెప్పారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు స్రవంతి, మీనా, కొండబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఆయుర్వేదం విశిష్టమైనది..

విజయనగరం టౌన్: ఆయుర్వేద వైద్యం అత్యంత విశిష్టమైనదని ప్రముఖ న్యాయవాది, వ్యాపారవేత్త పీవీ రామారావు అన్నారు. నా ఊరు విజయనగరం సంస్థ, వనిత వాకర్స్ క్లబ్, తిలక్ ఫౌండేషన్, విశ్వ కళాపరిషత్, గురజాడ బ్రాహ్మణ సమాఖ్య సంయుక్త ఆధ్వర్యంలో ప్రపంచ ఆయుర్వేద దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. కణపాక యూత్ హాస్టల్‌లో నిర్వహించిన వేడుకలకు పీవీఆర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయుర్వేద వైద్యం ప్రాముఖ్యత అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం వివిధ రంగాల్లో సేవలందించిన వారితో పాటు ఆర్‌ఎంపీ, పీఎంపీ వైద్యులను సత్కరించారు. కార్యక్రమంలో టి.మహేశ్వరరావు, కట్టమూరి చంద్రశేఖరం, మమ్ముల తిరుపతిరావు, ముళ్లపూడి సుభద్రాదేవి, గుమ్మలూరి విశాలాక్షి, తదితరులు పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

విజయనగరం క్రైమ్: విజయనగరం రూరల్ పరిధిలోని జమ్ము గ్రామ శివారులో పేకాటాడుతున్న ఐదుగురిని అరెస్ట్ చేసినట్లు రూరల్ ఎస్సై గణేష్ తెలిపారు. స్పెషల్ బ్రాంచ్ పోలీసుల సమాచారంతో దాడి చేసి నిందితులను అరెస్ట్ చేసి, వారి నుంచి 33,500 రూపాయలు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

క్యాన్సర్‌పై అవగాహన

గుర్ల: మండలంలోని పెద్దబంటుపల్లి సచివాలయం వద్ద విజయనగరం రెడ్ క్రాస్ చైర్మన్ ఆర్.డి.కె. ప్రసాద్ ఆధ్వర్యంలో ఆదివారం క్యాన్సర్‌పై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయ న మాట్లాడుతూ ఆహార అలవాట్లు మారుతుండడంతో క్యాన్సర్ వ్యాధి అధికంగా వస్తోందని అన్నారు. మద్యం, పొగ తాగడం, గుట్కా వంటి పదార్థాలు తీసుకోవడం వల్ల ఆరోగ్యం క్షీణిస్తుం దని, వాటికి దూరంగా ఉండాలని సూచించారు. రెడ్ క్రాస్ సంస్థ ఉచితంగా క్యాన్సర్ వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయిస్తోందని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ సతీష్, పంచాయతీ కార్యదర్శి మంత్రి జగదీశ్వరి, రెడ్ క్రాస్ ప్రోగ్రాం ఇన్‌చార్జి రామకృష్ణ తదితర

ముఖ్యమంత్రికి ధన్యవాదాలు


సమావేశంలో పాల్గొన్న బీసీ నాయకులు

విజయనగరం పూల్‌బాగ్: దాదాపు 92 సంవత్సరాల తర్వాత బీసీలకు కులగణన చేయిస్తున్నటువంటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి బీసీ సంక్షేమ సంఘ రాష్ట్ర ఇన్‌చార్జ్ బోను దుర్గానరేష్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఆదివారం స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలోని రెవెన్యూ హోమ్‌లో బీసీ సంక్షేమ సంఘ ఉత్తరాంధ్ర రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ, ఇప్పటివరకు ఏ నాయకుడూ చేయని పనిని మొట్టమొదటి సారిగా బీసీల కోసం ఆలోచించి ముఖ్యమంత్రి చేపడుతున్నారని చెప్పారు. కార్యక్రమంలో ఉత్తరాంధ్ర ఇన్‌చార్జ్ గదుల సత్యలత, రాష్ట్ర నాయకులు ఎం. జ్యోతి, బి. సీతారత్నం, సీనియర్ నాయకులు డోల మన్మథ కుమార్, నడిపేన శ్రీనివాసరావు, బొద్దాన అప్పారావు, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు, తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

అమ్మవారికి పంచామృతాభిషేకం


అమ్మవారికి అభిషేకం చేస్తున్న అర్చకులు


భక్తులకు అన్నప్రసాదం వడ్డిస్తున్న దేవస్థానం కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్

చీపురుపల్లి: పట్టణంలోని కనకమహాలక్ష్మి ఆలయంలో ప్రధాన అర్చకులు ఆరవెల్లి రవిశర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి ఆదివారం పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దేవస్థానం కమిటీ చైర్మన్ ఇప్పిలి గోవింద, వైస్ చైర్మన్ సూరు కుమార్ నేతృత్వంలో భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

డ్వాక్రా రుణాలతో మహిళల అభివృద్ధి


అఖిల భారత డ్వాక్రా బజార్‌లో పిడికర్రల స్టాల్‌ను పరిశీలిలస్తున్న రాజాం వెలుగు ఏరియా కో-ఆర్డినేటర్ చిరంజీవి

వంగర: డ్వాక్రా సంఘాల ద్వారా తీసుకున్న రుణాలతో మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నారని రాజాం ఏరియా కో–ఆర్డినేటర్ అలుగోలు చిరంజీవి అన్నారు. విజయనగరంలో ఏర్పాటు చేసిన అఖిల భారత డ్వాక్రా బజార్‌ను ఆయన ఆదివారం పరిశీలించారు. రాజాం నియోజకవర్గానికి చెందిన మూడు యూనిట్లు(స్టాళ్లు) వద్దకు వెళ్లి, విక్రయాలపై ఆరాతీశారు. ఇప్పటివరకు అమ్మకాల ద్వారా మొత్తం రూ.6.50 లక్షలు వచ్చినట్లు విక్రేతలు తెలిపారు. వంగర మండలంలోని కొప్పర పిడికర్రలు(మాప్‌స్టిక్స్), సంతకవిటి మండలంలోని సురవరం చేనేతవస్త్రాలు, రాజాం మండలంలోని కంచరాం పచ్చళ్లను స్టాల్స్‌లో విక్రయిస్తుండగా, వాటికి మంచి ఆదరణ లభిస్తోందన్నారు.

చురుగ్గా ఓటర్ల నమోదు


నెల్లిమర్ల రూరల్: యువ ఓటర్ల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న తహసీల్దార్ ధర్మరాజు


చింతలవలసలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ ఆదిలక్ష్మి


పూసపాటిరేగ: పూసపాటిరేగలో ఓటరుకు ఫారం అందజేస్తున్న తహసీల్దార్ భాస్కరరావు

డెంకాడ: మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఓటర్ల నమోదు ప్రక్రియ చురుగ్గా జరుగుతోందని తహసీల్దార్ పి.ఆదిలక్ష్మి అన్నారు. మండలంలోని చింతలవలసలో 187, 188వ పోలింగ్ కేంద్రాలు, ఏపీఎస్పీ బెటాలియన్ పరిధిలో ఉన్న 189, 190వ కేంద్రాలను ఆదివారం ఆమె పరిశీలించారు. అలాగే జొన్నాడ, బొడ్డవలస, తదితర గ్రామాల్లో ఉన్న పోలింగ్ కేంద్రాలను కూడా పరిశీలించి, సిబ్బందికి తగిన సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఉదయం పది గంటల నుంచి సాయంత్రం ఐదు వరకు సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు.

పక్కాగా ఓటర్ల నమోదు..

నెల్లిమర్ల రూరల్: ప్రత్యేక ఓటర్ల నమోదు కార్యక్రమం అన్ని గ్రామాల్లోనూ పక్కాగా చేపట్టాలని తహసీల్దార్ ధర్మరాజు సూచించారు. మండలంలోని గొర్లిపేట, కొత్తపేట, గుషిణి, చనమల్లుపేట పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఓటర్ల నమోదు, మార్పులు, చేర్పుల కోసం వచ్చిన దరఖాస్తులపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు నిర్దేశించిన వేళల్లో బీఎల్‌ఓలు పోలింగ్ కేంద్రాల్లో అందుబాటులో ఉండాలన్నారు. 18 ఏళ్లు నిండిన వారంతా తప్పనిసరిగా ఓటర్లుగా నమోదు కావాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్నికల డీటీ సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

28 పంచాయతీల పరిధిలో..

పూసపాటిరేగ: మండలంలోని 28 పంచాయతీల పరిధిలో ఓటర్ల ప్రత్యేక శిబిరాలు రెండో రోజైన ఆదివారం కూడా కొనసాగాయి. కుమిలి, పేరాపురం, పూసపాటిపాలెం, పూసపాటిరేగ గ్రామాల్లోని శిబిరాలను తహసీల్దార్ ఇ. భాస్కరరావు పరిశబులించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అర్హులందరికీ ఓటుహక్కు కల్పించాలన్నారు. అలాగే చేర్పులు, మార్పులకు కూడా అవకాశం కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో కార్యదర్శులు వెంకటరావు, ధనుంజయ, భూషణం, తదితరులు పాల్గొన్నారు.

పశు వ్యాధులపై అప్రమత్తం

రాజాం సిటీ: పశువ్యాధులపై పాడిరైతులు అప్రమత్తంగా ఉండాలని పశువైద్యాధికారి రాజేశ్వరి సూచించారు. ఆదివారం మండలంలోని బి.ఎన్.వలస గ్రామంలో పశువ్యాధుల నివారణపై అవగాహన కల్పించారు. అనంతరం ఆవుదూడలు, పశువులకు డీవార్మింగ్ మందులతో పాటు నట్టల నివారణ మందులు వేసి, చూడి పరీక్షలు చేశారు. పశువులకు వ్యా ధులు సోకకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారి మోహన్ పాల్గొన్నారు.

బైక్ ఢీకొని వ్యక్తికి గాయాలు

రాజాం సిటీ: బైక్ ఢీకొని వర్రి శ్రీనివాసరావు అనే వ్యక్తికి గాయాలైన ఘటన స్థానిక బొబ్బిలి జంక్షన్‌లో ఆదివారం జరిగింది. పట్టణంలోని చిన్నహరిజన వీధికి చెందిన ఆయన శనివారం రాత్రి 12 గంటల సమయంలో ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి బొబ్బిలి జంక్షన్ వైపు నడుచుకుని వస్తుండగా, ఆయనకు ఎదురుగా వచ్చిన బైక్ ఢీకొట్టింది. దీంతో గాయాలపాలైన అతడిని రాజాంలోని ప్రభుత్వాస్పత్రికి తరలించి, చికిత్స అందించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్‌ఐ భాస్కరరావు తెలిపారు.